క్లుప్తంగా

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ తవుడు, ఐసీడీఎస్ సిబ్బంది

గజపతినగరం రూరల్: నిత్యం అందుబాటులో లభించే ఆకుకూరలు తినడం వల్ల రక్తహీనత దరిచేరదని జెడ్పీటీసీ గార తవుడు అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా లోగిశ-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పైడి మంగమ్మ అన్నారు. గరివిడి మండలంలోని కొండపాలెం, శివరాం పాఠశాలల్లో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాలు, సఖీ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, వ్యక్తిగత ఆరోగ్యం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు భానుమతి, కల్యాణి, రాధ పాల్గొన్నారు.

సందడిగా ఫేర్‌వెల్ డే



అలరించిన విద్యార్థినుల నృత్యం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కొండలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ మిగిలిన తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి.కామేశ్వరరావు పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు, స్కేల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీ బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఎఫ్‌ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు రెండు రోజులుగా కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన సుమారు 77 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

పశువులను తరలిస్తున్న లారీ సీజ్

దత్తిరాజేరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓ లారీలో 40 పశువులను పార్వతీపురం నుంచి విశాఖపట్నానికి తరలిస్తుండగా శనివారం రాత్రి పెదమానాపురం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై బి.భాగ్యం తెలిపారు. లారీని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

శృంగవరపుకోట: కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నేతలు శనివారం ఆందోళన చేపట్టారు. స్థానిక దేవీ జంక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాలను చేతపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, ప్రతిపక్షాలను కుట్రపూరితంగా అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తక్షణమే రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో పాటు ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పి.మణిబాబు, హెజీబు నానాజీ, మెంటాడ అప్పారావు, ఆర్.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్ ఆసరా’తో ఆర్థిక వెలుగులు



చీపురుపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



మెరకముడిదాం: చినబంటుపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న మహిళలు



గజపతినగరం: సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న అధికారులు, లబ్ధిదారులు



గంట్యాడ: సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న డ్వాక్రా మహిళలు



బొండపల్లి: గొట్లాంలో వైఎస్సార్ ఆసరా ఆర్థికసాయం విడుదల కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డ్వాక్రా మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు



వేపాడ: జాకేరులో సీఎం ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): తోండ్రంగిలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ బంగారులక్ష్మి, డ్వాక్రా మహిళలు

‘వైఎస్సార్ ఆసరా’ మూడో విడత కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో అన్ని సచివాలయాలు, ఆర్బీకేలు, వైకేపీ కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరాతో మహిళల జీవితాల్లో ఆర్థిక వెలుగులు విరజిమ్ముతున్నాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: ఎస్.కోటలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు, అధికారులు

వనరులను పరిరక్షించుకోవాలి

• ఎస్‌ఈజీ సీఐ సీహెచ్ రాజేశ్వరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవలస: పునరుద్ధరించలేని వనురులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌ఈజీ సీఐ సీహెచ్.రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వరల్డ్ వైల్డ్ ఫోరం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ బి.వేణుగోపాలరావు అన్నారు. ఎర్త్ అవర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బీపీఏ రాజు, ఎం.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స పర్యటన రేపు

గుర్ల: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండలంలో సోమవారం పర్యటించనున్నారని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమైఖ్య అధికారులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడేం జంక్షన్‌లో నిర్మించిన సొసైటీ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు చెక్కును అందిస్తారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, ఇజ్జిరోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడవు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో అడ్మిషన్లకు ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్‌కు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9951120330కు సంప్రదించాలని సూచించారు.

సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎస్‌డీటీ ధనంతో కలిసి పాల్గొన్నారు. ఒకటో తేదీ నాటికి డీడీలు తీసి సరుకులు తెప్పించాలని సూచించారు. లబ్ధిదారులు ముందుగా సమాచారం అందించి, అన్ని కుటుంబాలకు రేషన్ సరుకులు అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందనట్లయితే సంబంధిత డీలర్, ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

1న మండల సమావేశం

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 1న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పప్పు సుదర్శనం శనివారం తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సత్ప్రవర్తనతో నడుచుకుంటే కేసులు మాఫీ

గజపతినగరం: రౌడీషీటర్లుగా కేసులు నమోదైన వారు సత్ప్రవర్తనతో నడచుకున్నట్లయితే వారిపై ఉన్న కేసులను రికార్డుల నుంచి తొలగిస్తామని ఎస్సై గంగరాజు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం రౌడీషీటర్లతో సమావేశమై ఈ మేరకు అవగాహన కల్పించారు. సమాజంలో అందరికి ఉపయోగపడేలా మంచి పనులు చేస్తూ.. సత్ప్రవర్తన, నైతిక విలువలతో నడుచుకుంటే వారిపై ఉన్న కేసులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొట్టివేయడం జరుగుతుందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

గజపతినగరం: విద్యార్థులు చదువుతో పాటు యోగావిద్యను కూడా నేర్చుకోవాలని జిల్లా క్రీడల చీఫ్‌కోచ్ పి.అప్పలనాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీకృష్ణ విద్యాపీఠం స్కూల్‌లో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అప్పలనాయుడు మాట్లాడుతూ.. రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండేందుకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. నిత్యం క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్న శీర వాసును ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల సమాఖ్య సెక్రటరీ సీఈఓ బి.రామగోపాలరావు, కరస్పాండెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవికి సత్కారం

దత్తిరాజేరు: వంగర గ్రామానికి చెందిన జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ దత్తి చిరంజీవిని జిల్లా టెలికాం అడ్వైజరీ చైర్మన్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అధికారులు శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు సత్కారంతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సత్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని చిరంజీవి అన్నారు.



చిరంజీవిని సత్కరిస్తున్న ఎంపీ బెల్లానం చంద్రశేఖర్



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్

ప్రశంసా పత్రాలు అందజేత

జామి: పదోతరగతి పరీక్షల్లో శతశాతం మార్కులు సాధించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి ఎం.హర్ష అన్నారు. ఇటీవల నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షల్లో విజేతలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ్



పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న పీఓ ఉమ, అంగన్‌వాడీ సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలో వెంకటరమణపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్.కోట ఐసీడీఎస్ పీఓ ఉమ పోషకాహార ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో మంచి పౌష్టికాహారాన్ని ఎలా పొందవచ్చో సీడీపీఓతో పాటు సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు క్రాంతి, శ్రీదేవి, పుష్ప, మాధవీదేవి వివరించారు. అనంతరం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకోటి, ఎంపీటీసీ రాపర్తి రామచంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయవ్యాధి నిర్మూలన



దేవుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: అవగాహనతోనే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించొచ్చని దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.ఝాన్సీ అన్నారు. దేవుపల్లి గ్రామంలో శనివారం క్షయ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.నారాయణప్పలనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాల జోరు పెంచండి



వేపాడ: బల్లంకిలో హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

గజపతినగరం రూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులంతా నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. గంగచోళ్లపెంట గ్రామంలోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల రెండో వారంలో సామూహిక గృహప్రవేశాలు ఉన్నందున లబ్ధిదారులు ఆలోగా నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సఖి కార్యక్రమంలో పాల్గొని ‘గుడ్ టచ్, బ్యాడ్ టచ్’పై విద్యార్థినులకు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుందర్శనం, కార్యదర్శి గోపాలకృష్ణ ఉన్నారు.

వేపాడ: జగనన్న లేఅవుట్‌లో, సొంత స్థలాల్లో హౌసింగ్ స్కీం కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. బల్లంకిలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. నిర్మాణాల్లో జాప్యంపై ఆరా తీశారు. ఐకేపీ ద్వారా అందిస్తున్న గృహ రుణాలను సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. బల్లంకిలో 46 గృహాలకు గాను 13 నిర్మాణాలు పూర్తయినట్లు ఏఈ అప్పలనాయుడు తెలిపారు.

సూక్ష్మ సేద్యంతో బహుళ ప్రయోజనాలు

శృంగవరపుకోట: బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో రైతులు సీహెచ్.దేముడు, గోగాడ అప్పలనాయుడుకు రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను శనివారం పరిశీలించారు. మెట్టు ప్రాంతాల్లో పంటల సాగుకు బిందు, తుంపర, సూక్ష్మ సేద్య విధానాలు లాభదాయకంగా ఉంటాయన్నారు. ఎరువుల యాజమాన్యంలో మెలకువలు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. మండలంలో 24 మంది రైతులకు రూ.4,86,495లతో 56 సూక్ష్మ సేద్యం యూనిట్లు మంజూరు చేశామన్నారు. వ్యవసాయ పనిముట్లు కావాల్సిన రైతులు స్థానిక ఆర్బీకేలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లోచర్ల రవి, ఏఓ మూర్తి, తదితరులు హాజరయ్యారు.



మైక్రోఇరిగేషన్ యూనిట్లను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

ప్రతీ విద్యార్థికి రాగిజావ అందించాలి



బొండపల్లి: గరుడుబిల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

బొండపల్లి: జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీని మండల ప్రత్యేకాధికారి ఎన్‌వీకే దుర్గాప్రసాద్ శనివారం పరిశీలించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి రాగిజావ బాగుంటుందా అని అడిగి తెలుసుకున్నారు. వారంలో మూడు రోజులు రాగిజావ అందించాలని, భోజనాల నాణ్యతలో రాజీ పడొద్దని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని పథకం నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎ.వేదవతి, పంచాయతీ కార్యదర్శి కె.ఎర్రినాయుడు, సర్పంచ్ బి.కృష్ణవేణి ఉన్నారు.

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని సీఆర్పీ రెడ్డి శనివారం పరిశీలించారు. విద్యార్థుల్లో రక్తహీనత నిర్మూలనకు ప్రభుత్వం అందిస్తున్న రాగిజావను ప్రతీ విద్యార్థికి అందించాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

దత్తిరాజేరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరితో కలిసి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లు, కుళాయిలను బాగుచేసి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేయడమే క్రాస్ ప్రోగ్రాం ఉద్దేశమన్నారు. సర్పంచ్‌లు తమ పంచాయతీల్లోని తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం చొదంతివలస, వింధ్యవాసి సర్పంచ్‌లకు ఫాగింగ్ యంత్రాలు అందచేశారు.



క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ

కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్‌లు గేదెల శ్రీదేవి, రంభ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ వాణిశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు శనివారం ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ట్రస్ట్ నిర్వాహకులు శ్రీరామ్మూర్తి వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కిట్స్‌లో అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర 10 వస్తువులు ఉన్నాయి. మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 579 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్.కోట సర్పంచ్ సంతోషకుమారి, ఎంఈఓ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష కిట్లు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఆదర్శ సమాజానికి రామాయణం దిక్సూచి

లక్కవరపుకోట: ఆదర్శవంతమైన సమాజానికి రామాయణం దిక్సూచి వంటిదని, రామాయణంలోని అంశాలను నిత్యజీవితంలో అన్వయించుకోవడం ద్వారా జీవితాన్ని ఆనందమయంగా మార్చుకోవచ్చని బ్రహ్మశ్రీ తాతా సందీప్‌శర్మ అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వసంతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో రామాయణంలో కిష్కింధకాండలోని అంశాలను సందీప్‌శర్మ వివరించారు.



ప్రవచనాలు చెప్తున్న సందీప్‌శర్మ

బాపనయ్య ఆశయాలు కొనసాగిద్దాం..



గజపతినగరం: బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు



వేపాడ: కొండగంగుబూడిలో బాపనయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనన కార్మికులు, రైతులు

గజపతినగరం: గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సభను పురిటిపెంటలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు. కార్మికులు, దళితులు, అనగారిన వర్గాల కోసం బాపనయ్య చేసిన పోరాటాలను గుర్తుచేసుకుని కొనియాడారు. బాపనయ్య ఆశయ సాధనకు కృషిచేయాలని, కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ వేణి, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నేత గుంటూరు బాపనయ్య కార్మికుల హక్కుల కోసం పోరాట స్ఫూర్తి ప్రతీ ఒక్కరిలో ఉండాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. కొండగంగుబూడిలో బాపనయ్య వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక సమస్యల పరిష్కారంలో బాసనయ్య ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు.